AOUA105B124

# క పో త క థ

V.R. NARLA MEMORIAL LIBRARY * V.R. NARLA
V.R. NARLA D.P.R.I. Acc. No. 10402

కర్త
వేటూరి ప్రభాకరశాస్త్రి

10402

ప్రకాశకులు
మేనేజరు. మణి
ముక్త్య
(కృష్ణా)

1956

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N10402

ii

ద్వితీయ ముద్రణము

1956

T
894.8271

894.8271
PRA

AUTHOR

N-10402

Dr. B. R. AMBEDKAR
OPEN UNIVERSITY
LIBRARY
HYDERABAD-500 033

# విన్నపము

శ్రీచంద్రమౌళీశ్వరులకు ఉపాయనముగా ముప్పదియేండ్ల క్రితము శ్రీ ప్రభాకర శాస్త్రిగారు రచించి ప్రకటించిన ఈ యలతి కృతి 'కపోతకథ' ను హైదరాబాదు ఉస్మానియా యూనివర్శిటీ వారు మూడుసంవత్సరముల డిగ్రీ కోర్సునకు పాఠ్యగ్రంథముగా పెట్టుటచేత, వారము రోజులలో త్వరత్వరగా ముద్రణము ముగించ వలసి వచ్చినది.

దైవ సంఘటన యేమిటోగాని ఈ గ్రంథము రెండవ ఫారము ముద్రణమగుచుండగా శ్రీ చంద్రమౌళీశ్వరులు దివంగతులైరి.

ఆనాడు ఈ గ్రంథ రచనావశ్యకతనుగూర్చి శ్రీ ప్రభాకర శాస్త్రిగారు వారి తొలిపలుకులో చెప్పియేయున్నారు. ఈ కృతిలో నంతర్గర్భితమైయున్న ప్రశంస, శ్రీవారి విషయమే గనుక, ఈ పునర్ముద్రణము, సందర్భశుద్ధిగలిగి సార్థకమేయయ్యె నని తలంచి, శ్రీ చంద్రమౌళీశ్వరుల ఔర్ధ్వదైహిక క్రియల పరిసమాప్తి నాటికి ముద్రణము ముగించి ప్రకటించుటయ్యెను.

శ్రీ ప్రభాకరశాస్త్రిగారు, 1920 సం. లో శ్రీ చంద్రమౌళీశ్వరులను ప్రప్రథమముగా దర్శించినప్పుడు రచించిన పద్యములుకూడ యిందు జేర్చితిని.

ఈ కృతి రచనా సందర్భమున వైదికబౌద్ధధర్మములలోని త్యాగప్రశస్తి ప్రశంసరాగా, వైదికధర్మములోని కథలెన్నో, బౌద్ధకథలకెక్కినవనియు, త్యాగము సర్వధర్మములందు సమానముగా ప్రశంసింపబడెననియు, శ్రీవారికి శ్రుతపరచి, అందుకు మచ్చుగా నీ కథను శ్రీ శాస్త్రిగారు రచించి వినిపించిరి. ఈ కథ భారతమునందు ప్రసిద్ధమైనటులనే, బౌద్ధజాతక కథలందును 'కపోత జాతక' మని ప్రసిద్ధమైయున్నది.

ముక్త్యాల<br>10-3-1956 } —ప్రకాశకుడు

—–—

# ఆశీస్సు

శ్లో॥ శ్రీమన్ కమ్మకులాంబుధి
చంద్ర! శ్రీచంద్రమౌళినృపమౌళే
సత్త్వ మధురస్వభావ
స్వాశ్రిత దీనార్థి విబుధకల్పతరో!

శ్లో॥ శ్రీరస్తు స్వస్త్యస్తు
క్షేమోస్త్వత్యంత సంప్రమోదోస్తు
సంకల్పసిద్ధిరస్తు సు
సంతాన సమృద్ధిరస్తు తే నృపతే!


మ. భగవంతుండు కలండు, పుణ్యమును
బాపంబున్నదీ, లాటికా
ర్యగతుల్, పుణ్యమొసంగు,
నిట్టియుఁ బాపాపాదకంబుల్, నరుండు
గణింపన్వలె వీని, ధర్మపథమందుం
బోవలెన్, శ్రేయమందుఁ
గుదురొక్కవలె, నంచు నెంచు
ధరణీంద్రుంగాంచి మోదించితిన్.

మ. క్షమ యత్యద్భుతమౌట యాశ్రితుల
　　　　కష్టంబుల్ సుఖంబుల్ సదా
తమవే యంచుఁదలంచు,
　　　　తెల్లఁ దయాదాక్షిణ్యముల్
కన్నులన్ జెమరింపం గనుఁగొంట
　　　　భోగములతోఁ జీకాకు గాకుంట నా
కమితానందము గూర్చె మీకడనె
　　　　యోహో చంద్రమౌళి ప్రభూ !

ఉ. భారతవర్ష వైభవము భగ్నమొనర్చెడు నన్యధర్మ
సంస్కారుల కాలమందిపుడు కర్మఠులై పరమార్థచిత్తులై
యారసి సర్వవిద్యల రహస్యములన్ గ్రహియింప గోరు వి
ద్యారసికుల్ ధరాధిపతులబ్బితి రిందుల కబ్రమందితిన్.

═══

5



శ్రీ రాజా

వాసిరెడ్డి చంద్రమౌళీశ్వరప్రసాదబహద్దరు గారు

జననము 1873 మరణము 1956

# తొలి పలుకు.

(ప్రథమ ముద్రణమున)

---

శ్రీ ముక్త్యాల సంస్థానాధీశ్వరులగు వాసిరెడ్డి శ్రీ చంద్రమౌళీశ్వర ప్రసాదబహద్దరు వారీవత్సరమున మహా వైభవముతో జరిపిన బ్రహ్మానందోత్సవ సందర్భమున సమ్మానార్థమై యరుదెంచిన విద్వత్కవు లీలుబ్ధక కపోతోపాఖ్యానమును శ్రీ వారినిదేశమున రచించుచుండఁగా నక్కడనుండి నేనును, నలవోకకై మూఁడుపూటలలో నిట్టిది ముగియ రచించితిని. తొందరగా రచించుటే పరమార్థముగాఁ జూచుకొనుటచే నిందు కవితాగౌరవము గానరాక పోవచ్చును. నా రచన మెట్లున్నను భారతమం దీ కథ ప్రఖ్యాత మైనది. తిక్కనసోమయాజుల తెలుఁగురచనమే దీని కాధారము. సంస్కృతగ్రంథము నప్పుడు నేను జూడలేదు.

ఆర్తరక్షణార్థమై యాత్మత్యాగము చేయువారి మహోత్కృష్టప్రాభవమును, అట్టివారి నడవడి కెట్టికఱకు ఱాగుండెవానిఁగూడఁ గఱఁగించి సద్వర్తనుఁ గావింప గాఁగల సామర్థ్యమును, నీ కథ ప్రతిపాదించుచున్నది.

ఆశ్రితవాత్సల్యము, దయ, ధర్మము, దైవభక్తి, మొదలగు సుగుణములకుఁ దానకమైన శ్రీ చంద్రమౌళిక్షమాపాలురకు అలవోకగా రచించిన యీ యులఁతికృతి నుపాయనముగా నొసఁగుచున్నాఁడను. ఇట్లాశీర్వదించుచున్నాఁడను.

గీ. పుణ్యకీర్తితో సుపుత్రసుపుత్రికా
వృద్ధితోడ నిష్టసిద్ధితోడ
పెక్కు వత్సరములు చక్కఁగా శ్రీ చంద్ర
మౌళివిభుఁడు రాజ్యమేలుఁ గాక!

చెన్నపురి
20-11-25

వేటూరి ప్రభాకరశాస్త్రి

# కపోతకథ

శ్రీ నిరంతరానంద నిశ్శ్రేయసార్థ
సాధకము సర్వకిల్బిష బాధకము స
మగ్రవిజ్ఞానదము మహామహిమఘనము
శరణమగు మాకు సద్గురుచరణయుగము.

క. గురుచరణమ్ములకు నమ
స్కరణ మ్మొనరించి కవనకౌశల మొప్పన్
విరచించెద నొకగబ్బము
శరణాగతరక్షణ ప్రశంసాపరమున్.

క. క్రోవరిపిండు ముదఁపడ
నీవరి ప్రాసంగు దొట్టి నెఱిగల సస్య
శ్రీ వరియించినదై గో
దావరి దరి తెలుఁగుసీమ తనరారుఁ గదా!

శా. ఆ గోదావరితీరమందు నొక రా
జ్యం బిప్పు డొప్పారు ల
క్ష్మీగేహం బనునట్లు, లందుఁ బ్రభువుల్
చెన్నారు చున్నారు స

10

ద్యోగుల్ భోగులు ధర్మతత్పరులు ధీ
రోదాత్తు లత్యుత్తముల్
ఔఁగల్ గాక ప్రజల్ విధేయు లయి యా
రాధింతు రాభూపులన్.

ఉ. తాతల నాఁట నుండి బహు
ధర్మపరాయణులై చెలంగు నా
భూతల నాథులం దిపుడు
పౌఁఖ్బ నృపాలకుఁ డుత్తమోత్తమ
ఖ్యాతి గడించెఁ బోష్య జన
కల్పక మంచును బుణ్యకార్య చ
ర్యాతతబుద్ధి యంచు శర
ణాగతరక్షకుఁ డంచు నెల్లెడన్.

ఉ. పొంగఁడు రాజ్యవైభవముఁ
బొందితి నంచును బాపచింతకున్
లొంగఁడు సంపదభ్యుదయ
లోలుపతన్ వెత లందఁ డెన్నఁడున్
గ్రుంగఁడు రాజ్యనిర్వహణ
రూపభరంబును మోయుపట్టునన్
భంగ కొఱుంగనట్టి నర
పాలుర తత్సము లెందు నుండురే.

శా. ఆదాయమ్మును మించునట్టివ్యయ మ
త్యాసన్నమై యుండ నే
దేదో సల్పుచునుండు నెల్లపుడు స
త్కార్యత్వంబు నత్యుత్త మా
హ్లాదం బందుచునుండు రాజ్య సుఖమం
దాసక్తుఁడుం గాఁడు తాఁ
దాదాత్మ్యంబున నొప్పు నెప్పుడు సము
ద్యద్ధర్మ కర్మాప్తితోన్.

సీ. తనమాట జవదాఁట కనయమ్ము వినయమ్ము
గల్గి కొల్చెడు కులకాంతవలన
తనయిచ్ఛకును నచ్చఁ నగునట్లు పనిపాట్లు
జరుపుచుండెడు భృత్యసమితివలన
తనకూర్మికిని నోర్మికిని మెచ్చి చన విచ్చి
వేడ్కఁగూర్చెడు బంధువితతివలన
తన యుత్తమ సువృత్తమును జూచి కడు నోచి
తిని జీవితముఁ బుచ్చు జనమువలన

భూమిపాలన వ్యాపారభూరిభరము
సర్వ మలవోకవోలెను నిర్వహింపఁ
దగినదై యుండె నా మహీదయితునకును
దాన డెంద మధ్యాత్మతత్త్వమునఁ దగిలె.

సీ. వేలకువేలుగా వెచ్చ పెట్టుచునుండు
బడులకంచును వేల్పుగుడులకంచు
మితిలేని ధనమిచ్చి మెచ్చించు సత్కవి
నాయకులను మంచి గాయకులను
ఎంతసొమ్మైనఁ దానేయిచ్చు బహుజప
మంత్రమ్ములకు యజ్ఞతంత్రములకు
వేఁడినదెల్ల మా రాడకుండ నొసంగు
నార్తులకును బుణ్యమూర్తులకును
మంత్రులును బందుగులు నతిమానమైన
వ్యయముఁ దలఁచియు నృపు సత్స్వభావమునకు
లోఁగియుండి మారాడకయూఁగలయిరి
వెచ్చపెట్టు టంతంతకు హెచ్చఁజొచ్చె.

ఉ. బాల్యమునుండి యాతనికిఁ
బ్రాణసఖుండుగ నుండువాఁడు సౌ
శీల్యము గల్గువాఁ డొకఁడు
చేరి నృపోత్తమ ! రాజ్యమందుఁ బ్రా
బల్యముఁ గూర్చుకుంట తగ
వా ! మిముఁ బోంట్లకు ! సర్వలోక వా
త్సల్యమునే జపించెదవు
సంపద పెంపునుగూడఁ జూడవో !

క. శరణాగతరక్షణ మది
సరి గాదనఁగాదు గాని సర్వస్వము త
త్పరతనె వెచ్చించుట మఱి
సరిగా దనఁగా నొకింత సాహసి నగుకుఁ.

శా. దండిన్ బండితులున్ గవుల్ గిథకులున్
దత్త్వజ్ఞులున్ యాచకుల్
మెండై యుండుట మెచ్చఁగాఁ దగినదే
మిత్రోత్తమా! యాయపుం
బండాలమ్మును జూచుకొంచు వ్యయముం
బాటింపఁగాఁ జెల్లు శ్రీ
భాండాగారము పెంపు నింపవలదే
పల్నాటి భూపాలకుల్.

క. అడిగినవారల కెల్లన్
విడఁబడి యీయంగఁదగునె విబుధాచలమున్
బొడ వడఁగదె బహుయాచక
విడంబనముచేత, నెఱుఁగవే మది నిదియున్.

సీ. అనుడు నాభూమిపతి నుస్మితాస్యుఁ డగుచు
జన యనుంగు భుజంబుపైఁ దాఁకి యిట్లు
చెప్పఁగా బూనె; నెయ్యుఁడా! తప్పుఁదలఁచి
నాఁడ వొక్కింత నాపలుకు-జాడ వినుమ!

క. అజ్ఞానుఁడనై రాజ్య మ
వజ్ఞాపాత్రమగు నన్నుభయ మెఱుఁగక నే
యజ్ఞములని వ్రతములని యు
పజ్ఞారహితముగఁ జేయ వాంఛించితినే !

వ. ఎఱుఁగవుగాక నీ కొక్క రహస్యం బెఱిఁగించెద వినుము.

ఉ. మందులవంటి ధర్మముల
మర్మములన్ బహు సత్కథా సుధా
స్యందమునందుఁ జొన్పి మును
శాంతనవుం డల ధర్మరాజు కో
రం; దను వంపసెజ్జపయి
రాల్పడుచున్నను శాంతచిత్తుఁడై
విందులు వెట్టినట్టు రస
విస్ఫురణంబునఁ జెప్పె నొప్పుగన్.

ఉ. అంచిత ధర్మ నిర్మల ర
హస్యము లెయ్యవి ధర్మరాజుతోఁ
గొంచక చెప్పె భీష్ముఁ డవి
గొప్పగ విప్పుగఁ జేసి వ్యాసుఁ డా
పంచమవేదమై వెలయు
భారతమం దల శాంతిపర్వమం
దుంచి రచించె నందుఁ గల
దొక్క కథానక మేను జెప్పెదన్.

గీ. సరసచతురబుద్ధి శాంతనవునివంటి
ధర్మవేత్త మత్పితామహుండు
బాల్యమందు నన్నుఁ బఠియింపఁజేసె నా
సర్వకథలు శాంతిపర్వమందు.

గీ. సర్వసమయములందు నా శాంతిపర్వ
కథలె మెదలుచునుండు నా కడుపులోన
ఏపనిని జేయఁబూనిన నెపుడు నాకు
నాకథలె ధర్మనిర్ణయ మాచరించు.

వ. అని యాత్రాప్రభూత్తముండు శాంతిపర్వగతమగు కథ
నొక దాని నిట్లాతనికి వినిపింపందొడంగె.

సీ. కానల కేఁగి మృగవ్యూహములఁ బక్షి
    గణములఁ జాల మారణ మొనర్చి
కణఁకతో వానిఁ బట్టణములయందు వి
    క్రయ మొనర్చి ధనంబు గణనచేసి
చేయుచునుండెను జీవయాత్ర నొకండు
    బోయండు; వాఁ డొక్కప్రొద్దు పెద్ద
సన్నాహమున వేఁట సాఁగింపఁ గాఁ గాన
    నంబునకును బయనంబు చేసె
జాగిలంబులు వలలును డేగ లుచ్చు
లురులు జిగురుఁగండెలు పెక్కుదెఱఁగు లయిన

సాధనంబులు పైకొని సాయ మన్యుఁ
డొక్క రుండును లేకయే యుక్కు మిగిలి.

వ. అక్కడ.

చ. ఉరులిడె మాట్లు వెట్టె వల
 లొగ్గెను డేగల నాకసంబునం
బఱపెను గుక్కజట్టుఁ బసి
 పట్టగ విడ్చెను, వెక్కుయత్నముల్
జరిపెను గొన్నితోఁచుముల
 జంతువులన్ గ్రహియించె నంత నీ
శ్వరకరుణాతిరేకము వ
 శంబున నో పెనుమార్పు లేర్పడెన్.

చ. చెరచెర సూర్యరశ్మి కడుఁ
 జెమ్మట లూరఁగఁజేసె వాయుసం
చరణము లేకపోయెఁ బెను
 సంకటమయ్యెను భూతకోటికిన్
సరిగ నొకింతసే పదియు
 సైఁచుట బోయకుఁ గూడ నెంతొ దు
ష్కర మనిపించె నాకసము
 చాయ వెసన్ వెసఁ గ్రొత్త లేర్పడెన్.

చ. చిటచిటలాడు నత్తఱేని
జేరెఁడు మచ్చగ నుత్తరంబు ది
క్తటమున మబ్బు గానఁబడెఁ
దత్క్షణమే యది చేటఁతుంతగా
స్ఫుటముగఁ దోఁచె నంతఁ బది
మూలల నాకసమెల్ల నచ్చట
చ్చటఁ జిఱు పెద్ద తునకలయి
సాఁగెను మూఁగెను బెద్దమబ్బు గాన్.

శా. ఉక్కం గ్రుక్కలు ద్రిప్పుకోఁ గుదుర కెం
తో కష్టమెయున్న పే
రిక్కట్లున్ దొలఁగింపఁ కార్మొయిళు లెం
తే నంబరాంతంబులన్
నెక్కొఁగాఁ జలచల్లనై సుఖదమై
నిండారి మెండారి యా
చక్కన్ వాయువు వీవఁగాఁ దొడఁగె దు
స్తాపంబుఁ జల్లార్చుచున్.

ఉ. వీచెను హోరుగాలి వన
వీథుల నిండిన పండుటాకులున్
లేచె నభస్స్థలంబును మ
లీమసమయ్యెను ధూళి రేఁగఁగాఁ

18

గాచిన వృక్షకాండములు
గాయలు పండులు రాల్పెఁ బక్షులన్
గీచురటంచుఁ గూయఁదొడఁ
గెన్ మృగముల్ చెలరేఁగె నత్తఱిన్.

చ. చిటపటమంచుఁ బెద్దపె
చిన్కులు రాలఁ దొడంగెఁ గాలు ర్క
మ్మున్కట యధికంబు గాఁదొడఁగె
భూమియు నాకస మన్న భేద మం
తటఁ గనరాకపోయెఁ జక్
తమ్యతిళో ( జెలరేఁగె మించులున్
బెటిలు పెటిల్లు మంచుఁ జెను
పిడుగులు రాలెను మిక్కుటంబుగాన్.

సీ. భూమిభాగము జలప్లుతమయ్యె నభమెల్ల
గాఢాంధకారమ్ము క్రమ్మకొనియె
అంతరిక్షము భూమి నంతరించెడుమాడ్కి
సంతతధారగా నాగె వృష్టి
హోరను మ్రోఁత నింగారెను మిఱ్ఱును
బల్లంబు నేకమై నెల్లినారె
చెలరేఁగె నీఁదురు చలి మిక్కుటంబయ్యె
మృగములు ఖగములు బెగడఁదొడఁగె

తెలిపి యేర్పడదయ్యె నత్తఱిని గలకు
బోయ మదిగూడఁ గడుభయంబున మునింగె
అడవిలో నాతనికి నిల్వ నెడము గాన
రాఁ బోయెను బెద్దచీఁకటు గవిసె.

గీ. అస్తమించెను సూర్యుఁడు కస్సిగూర్చు
వాన యెంతయు హెచ్చె నక్కానలోన
బోయఁ డాతండు మిట్టైన భూమిచాయఁ
జక్కనెదిగిన యొక వనస్పతిని దరిసె.

గీ. సందలకొలంది యేండ్లకు ముందుఁ బుట్టి
ప్రబలి జొంపములన్ గదిరి కన్పట్టుచున్న
యాధరాజముఁ జే యావ్యాధుఁ డొదిగి
యుండె నాదండ నొక పెద్దబండమీఁద.

ఉ. "రాతిరియయ్యె నిత్తఱి ధ
రాజముపై వసియించుచున్న యో
భ్రాతములార! పెన్భయము
పుట్టెడు నెట్టులు జీబుటిర్లలోఁ
సీతున నిల్తునో యిచట
సేమ మొసంగి యనుగ్రహింపుఁడీ!
యాతురునిన్ ననున్ గరుణ
నాపద లేవియుఁ జూపకుండఁగాన్."

వ. అని ప్రార్థించి యాబోయం డమ్మేడ నొదిగియుండె నప్పుడు.

ఉ. ఆ తరుకోటరాంతరము

నందు వసించు కపోత మొక్కఁడా

రాత్రివేళఁ బ్రేయసి తో

అన్ దరియన్ జనుదేరకుండుటన్

జేతము భీతిపాలుపడి

చేడ్పడి నేడ్పున గొంతు రాల్పడన్

గూఁతలువెట్టెఁ బక్షులకుఁ

గూడ వియోగ మశక్యమేకదా!

"సీ. ఏల రాదయ్యెనో యిందాఁక నాసాధ్వి

గాఢాంధకారమ్ము గ్రమ్మెనొ నియె

కూలెనో యెందేని గాలివానకుఁ, దాళఁ

జాల నమ్మేద నాదుతన్విఁ గాసి

కువకువలాడుచు గూఁటిలో నాప్రక్క

చాటున శయనించు చానలేదె?

ననుఁబాసి తానెంత వనరుచున్నదియొకో

కటకటా! ప్రాణాన గలదొ లేదొ!

ఏమి సేయువాఁడ నెచట వెదకువాఁడ

నేమిదిక్కు నా కిఁకేమిదిక్కు

అదరుచుండె గుండె నిదురయు రాదయ్యె

నింపు మాలె నాదు కొంప గూలె.

సీ. ఎంతమున్న దానవో యెలనాఁగ నా యీఁగ
  తిం దలంతువొ లేదొ తెలియరాదు!
నాకుఁగా నీవెంత యేఁకారుచుందువో
  వింటువో వినవొ నా విలపనంబు!
ఇల్లాలు! నీవులే కీకోటరప్రగూఁటఁ
  జేరి కాపుర మెట్లు చేయఁగలను!
జీవించి యుండైన నీవున్న దానవా
  కానవా! నాదు దుఃఖంబు పెల్లు
ప్రేయసీ! యెందుఁబోతివే ప్రియునిఁబాసి
యోసి యర్ధాంగలక్ష్మి! యెట్లోర్తు నింక
సంకటమ్ముల సైరింపఁజాల భావి
జీవితము నాకు బరువయ్యెనే సఖూటి!"

వ. అంచుఁ బలవించుచుండ.

గీ. బోయవలలోఁ దగులొ్కని పొగులుచున్న
యాఁడుపావుర మా పలుకు జాడలు విని
డెంద మానందమునఁ బొంది తందరింపఁ
దాను దనలోన నీమాట్కిఁ దలఁచుకొనియె.

ఉ. "నెమ్మది నా పయిం బ్రియము
  నిండి మగండు మదీయ విప్రయో
గమ్ము సహింపజాలఁక పొ
  కాలుట వింటిని బుణ్యసాధ్వులం

22

దెమ్మెయిఁ బేరుగాంచితి బ
లే! బలె! భర్తకు నార్తిఁగూర్చు పెన్
కుమ్ములమారి పెండ్లముల
కుత్సితపుంగతి దప్పి యొప్పితిన్."

శా. ఆనందంబున నట్లు లోఁ దలఁచి యా
యాఁడుంబులుం గాడు "నో
హో! నా భాగ్యమ! జీవితేశ్వర! యిదే
యుంటెన్ వలం జిక్కితిన్
నీ నా నెయ్యము తియ్యముల్ ముగిసెఁ బో!
నేఁ డింక జంకాడినన్
గానన్ రాదు ప్రయోజనం, బె వనికోఁ
గర్మంబుఁ దప్పింపఁగన్.

చ. ముసురున ముఁగ్గి యీాగ్గెనని
పొక్కకు మిక్కడ బోయవచ్చి పై
విసరె వలన్ దగుల్పడితి
వెల్వడిరా నిఁకరాదు గాన నా
యుసురునుగూర్చి యాసవిడు
మో యనుఁగుం జెలికాడ! నీ విటన్
వ్యసనము వీడి ధర్మపథ
మందుఁ జరించుట యుంచితంబగున్.

ఉ. అదరుచు భూరుహాంతికము
నం దలబోయ వసించి చత్తునన్
బెదరున భూతకోటి నదె
పెల్లుగఁ బ్రార్థనసేయుచున్నవాఁ
డది వినియుండు వార్తు శర
ణాగతుఁ బ్రోచుట ధర్మమాట నో
సదయమతీ! వెతన్ విడిచి
సల్పుము వానికి సత్సహాయమున్.

క. ఒడలెల్లఁ దడిసె సీతున
గడగడ వడఁకాడుచుండెఁ గావలయున్ బో
యుఁడు వానికి నేమేఁ దో
డ్పడుమా, యపకారబుద్ధిఁ బరికింపకుమా!"

వ. అనుటయు.

శా. ఆమాటల్ వినెఁ బూర్వజన్మకృతపు
ణ్యం బంత విప్పయ్యెనో
యేమో! యానుఁగపావురంబు మదిలో
నింతేనిఁ జింతింపలే
దామర్త్యున్ బ్రబలాపకారకరణున్
బ్రార్థించె మర్త్యస్వర
వ్యామిశ్రంబుగఁ గంఠమెత్తి యిటు ధై
ర్యౌదార్యముల్ పేర్పడన్.

శా. " అన్నా ! బోయఁడ ! మా గృహంబునకు
నీ వభ్యాగతుం డైతి వే
నెన్నన్ బక్షిని, పావురంబను, గడున్
హీనుండ, నాహారమున్
దిన్నావో మఱి లేదో, యేదయిన నా
తిథ్యంబు గాంక్షింతువో,
యున్నాఁడన్ సమకూర్పఁగల్గినది యంతో
యింతో యర్పింపఁగన్.

క. "పక్షివి నీ విట్టు దయా
దాక్షిణ్యము లెఱుకుమీఁదఁ దాల్చెదె? " యని న
న్నాక్షేపింపకు, బ్రదుక
న్నా, క్షణికము! ధర్మమే కదా స్థిర మరయన్ "

మ. అనఁగా నాతఁడు సంప్రమోదభరితుం
డై యిట్లనున్ "బాపురే!"
యనఘా! పక్షివరేణ్యా! నీ పలుకు ల
త్యాశ్చర్యమై తోఁచె బో
యను నన్నింత యనుగ్రహింతె? చలిచే
నంగంబు మ్రోడయ్యె నీ
వసటన్ బాపఁగ నోపుదే నిచట
నిల్వన్నేర్తు నీరాతిరిన్.

25



వ. అనుటయు నప్పావురంబు తెక్కలు విదిర్చుకొని ప్రక్కనున్న పక్కనంబునకుం జని యక్కడ నొక్కెడం జిదుకుల మంటలో మండుచున్న పుల్లనొక్కదాని నిప్పుసల్లారకుండం గొనితెచ్చి యడవి యది తడిసియుండెం గావునం బొడిపుల్లల నొకను బొందంజాలక కోటరాంతర్గత మగు తనకులాయమ్మును గూలంద్రోసికొని యప్పుల్లల నెల్లం బ్రోవిడి నిప్పు రగిల్చి పెనుమంట దరికొల్పి యబ్బోయతో నిట్లనియె.

క. "వడవడ వడంకుచు నుంటివి
కడుం జాగయ్యెంగదన్న! కాఁచియపుడం జొ
ప్పడ దీక నగ్గి రగిల్చితి
నొడలెల్లం గాచుకొనుము! యోపిక గనుమా!"

వ. అనుటయు;

ఉ. బోయఁడు నిప్పు చెంతకును
బోయి సుఖంబు నఖంపచంబు నా
ప్యాయన మైనమాడ్కిం దన
యంగములం గడకొల్పె వేడి నా
హా యని మెచ్చె హాయి గొనె
నంతట నాఁగఁగరాదొ యిస్సిరో!
హేయముగా మఱొండు జని
యించెను వాంఛిత మప్డు వానికిన్.

26

క. "పక్షీ, మంట రగిల్చితి
రక్షించితి వపును గాని రాఁజఁ దొడఁగెన్
కుక్షిన్ క్షుధాగ్ని దీనిమ
హాక్షోభము నార్చువెరవు నరయఁగదన్నా
గీ. కొన్ని పిట్టలు వలఁ దగుల్కొనియెఁ గాని
వాని నిపుడు గుర్తింప నావశము గాదు
ఏచి వానతోఁ జలిగాలి వీచుకతనఁ
గటికచీకటి వనమెల్లఁ గ్రమ్ముకతన.
క. ఇంటికిని జేరఁగల నను
కొంటివి గాఁబట్టి తెచ్చుకొననైతి నెదే
వంటక మిపు డెంతయు నా
కొంటినయో యిచట నిలువఁగూడక యుండెన్."
వ. అనుటయు నప్పావుర మిట్లనియె:
ఉ. "పక్షుల మమ్ము, మా యునికి
పట్లను మా గమనమ్ము నింక మా
కుక్షుల నించుకొ న్నెరవుఁ
గూరిచి చేరిచి భావిజీవితా
పేక్షను మేను దాఁచుకొను
విత్తమునున్ విభవంబు సర్వమున్
వీక్షణ సేయుచుండు గద
వే నిరతంబుఁ గిరాతకాగ్రణీ!

వ. అన్నా! నీకేమి యాహారంబుఁ దెచ్చి యీయఁ గల్గువాఁడ"
ననుచు విన్నందనమ్ముగదురఁ బలికి మనమ్మున నిట్లను
కొనియె.

చ. 'అతిథి హతాశుఁ డెవ్వనిగృ
హంబుననో; శరణార్థి చక్కఁ ర
క్షితుఁడయి యొప్పఁడో యెవని
చే, నలవానిగృహంబు, భాగ్యమున్,
బ్రతుకును బాడుకొంపదివె
వంటివిగా వినియుంటి, నెట్టులే
నిరని యభీప్సితంబు ఘటి
యింతును గాంతుఁ గృతార్థభావమున్.'

గీ. అస్థిరంబైన దేహంబు నప్పగించి
సుస్థిరంబైన పుణ్యంబు చూఱగొందు;
కాకిబంగారము నొసంగి గణ్యమైన
మేల్మిబంగారమును గొంట మేలుగాదె.

శా. "ఆత్మార్థం పృథివీం త్యజే" త్తనెడువా
క్యం బేమివాక్యంబొ! తా
రాత్మత్యాగమునన్ బరప్రియము సే
యం బూనువారే సుధ
న్యాత్ముల్, బోయకు నిప్పు డోయిరముగా
నంగమ్ము నర్పించి నే

నాత్మత్యాగసముద్భవాద్భుత సమా
హ్లాదాబ్ధిలోఁ దేలెదన్."

వ. అని తలపోసి,

శా. "ఏఁకారన్ బనిలేదు తెప్పటిలు మో
యీ, బోయఁడా నాయొడల్
కైకో మ్మాఁకటిమంట తీఱుటకు నై
కన్గొ మ్మిదే నీచమా
నీకాయ మ్మతిథిక్షుధార్తి నుడుపన్
వేల్తున్ జ్వలద్వహ్నిలో
నీ కిద్దాన నొకింత దృప్తియగునేన్
నేధన్యతం గాంచెదన్.''

చ. అని వచియించి యగ్గి దరి
యం జని చక్కఁ బ్రదక్షిణించి నె
మ్మనమున నించు కేని యను
మానము నొందక యాత్మదేహ మ
య్యనలమునందు వేల్చెఁ బులుఁ
గల్లటి యారసి క్రూరచిత్తుఁ డ
య్యును బెనుచింతనాబ్ధిఁ బడి
యుక్కిరి బిక్కిరి యయ్యె బోయయున్.

ఉ. 'మానస మూఁచుచున్న దతి
మానుషమైనది దీనిచర్య యా

హా, నెన రిట్టిదింగలదె!
యద్దిర యిద్దియుఁ బక్షియే, ననున్
హీనుని దుశ్చరిత్రుఁ గరు
ణింప నకారణ మిట్లు రూపముం
బూనిన యీశ్వరుం డగును
బో! యిఁకఁ బెక్కుదలంపు లేటికిన్.

మ. చలికిం జచ్చుచునున్న నన్ను దయ
హెచ్చన్ వెచ్చఁగా మెచ్చఁగాఁ
జలిమంటన్ దరికొల్పి ప్రోచె నసువుల్
స్వస్థంబు లయ్యెంగదా!
తెలవాఱన్ మఱి చూచుకోఁదగదె భు
క్తింగూర్చి, యిస్సీ, యిసీ!
నిలువన్ లే కదిగూడ వేఁడి పడితిన్
నేఁ బాపకూపంబునన్.

గీ. పురుగులను దిని జీవించు పులుఁగునకును,
నెంతవిజ్ఞాన మబ్బె! నిస్సీ! మనుష్య
జన్మమెత్తియు ఱాగుండె చండి బండ
మొండి ముండకొడుక నైతి మోసపోతి

ఉ. నీతులు పల్కు వారిల న
నేకులు తోఁతురు, వారి చేఁత లా

29
V.R. NARLA MEMORIAL LIBRARY
V.R. NARLA D.P.R.I. Acc. No.

రీతులఁ జక్కఁగా ననుస
    రించుట తోఁపదు; మేలు గల్గ దా
కోఁతలనూ ర్లచే నొరుల
    కున్, దగఁ దాము వచించుధర్మముల్
చేఁతల నిల్వరింతురు వి
    శిష్టులు వారుగదా జగద్గురుల్!

గీ. కడఁగి యజ్ఞాన గాఢాంధకారమందుఁ
గొట్టుకాడుచునున్న నా కిట్లు తోఁపఁ
జేసి విజ్ఞానపుంజ్యోతి చేఁతవలన,
నేమి పక్షియే యిది! గురుస్వామి నాకు.

క. కోరిక లభింప నింకొక
కోరిక యదిగల్గ మఱొకకోరిక యది చే
కూరిన నింకొక టిఁ కొక
టీరీతిం గోర్కు లెప్పు డెడుగును గదరా!

క. ఛీ! ఛీ! యిటువలెఁ బైపై
నే చెడుకోరికల పెల్లు నీక్షణమందే
రా చెడ నిహాభిమానముఁ
బాచెదఁ ద్రోచెదను దుస్స్వభావము భవమున్."

వ. అంచు నైహికవాంఛాపరంపరలందు విరక్తుఁ డయ్యె నా
వ్యాధుఁ డప్పుడు,

సీ. బోయ డెందము మాఱఁ బాయఁదన్నినయట్టు
లంధకారముఁ బాసె నాకసంబు
బోయచిత్తమునం బ్రబోధమ్ము వెలిఁగిన
ట్లలరారె నెల నభోభ్యంతరమున
బోయపాపము లుడివోయిన మాడ్కిఁగా
నిట్టట్టు వాననీ ర్వట్టిపోయె
బోయకు వైరాగ్యమును బోలె సుఖదమై
మందమారుతము వీవం దొడంగె

గీ. అడవి బెడఁగారె నందంబు విడువఁబడిన,
పన్నఁబడిన జంతువు లురుల్ వలలు మొదలు
గాఁగలుగుసాధనంబులు గానఁబడియె,
బోయఁ డవియెల్ల నొకచోటఁ బ్రోవుచేసె.

ఉ. పట్టినపిట్టలన్ విడిచెఁ
బన్నినయుర్లు వలల్ సడల్చెఁ దా
ముట్టినయట్టి తక్కు కొఱ
ముట్లను గుక్కల డేగలన్ విడెన్
బుట్టిన సుప్రబోధమున
మోహపుద్రోహపు టూహలెల్ల న
ట్టిట్టయి పాయఁగా నతఁడ
దే తలపోయుచునుండు నంతలోన్.

గీ. వలలు నురులు సడల్పఁగాఁ దొలఁగిచనిన
పక్షులును జంతువులు నునికిపట్ల కరిగె,

నంతలో నక్క పోతపుఁ గాంతగూడ,
జీర్ణతరుకోటరిమునకుఁ జేరవచ్చె.

వ. వచ్చి తన వల్లభుఁ డగ్నిలోఁ ద్రెళ్ళియుండుటఁ బొడగాంచి యిట్లని యడలఁదొడఁగె.

సీ. "హానాథ! నీవు నెమ్మినిలో సగపాలు
యినుండ నగిపా లయితి వెట్లు?
ప్రాణమ్ములెల్ల నీ పైఁ బెట్టుకొనియున్న
నన్ను జగించి పో న్యాయ మగునె?
పతిఁ గోలుపోయి జీవితము పుచ్చుట సాధ్వి,
కతిదుస్సహంబని మతిఁ దలఁపవొ?
బోయ కోయిరమయి పోనున్న దను వగ,
రేఁగఁగా ననుఁ బల్కరింపవైతె?

గీ. క్రొత్తకల్గె బోయకు మది మెత్తనయ్యె
విడిచె నాకింకఁ బరతంత్రవృత్తి దొలఁగె
శోక మేమిటికో నాకు నీకుఁగూడ,
నొక్కటే పుణ్యలోకము దక్కుచుండ!

గీ. రాయివంటి కఱకుబోయని డెందము
కరఁగె నీవు మేను దొఱఁగు కతనఁ
దప్పెఁ బాపమృత్యు విప్పుడు నీయను,
గమనమునను బుణ్యగతిని గందు.

క. వల్లభ, వల్లభ, వల్లభ.
యుల్లాలిం గొంచునేఁగవే!" యను చగ్గిం

జల్లారకుండ రగిలిచి
త్రెళ్లెం దా నందు సత్సతీ ధర్మమునన్.

గీ. వచ్చె దేవ విమానంబు మెచ్చె వారి
నందుఁ గొనిపోయె దేవతా బృంద మపుడు
బోయఁ డక్కడ మిగుల నద్భుతము గదుర,
బ్రమసి కనుఁగొనెఁ బక్షిదంపతుల గతులు.

ఉ. నివ్వెఱ దోఁప నాతఁ డటు
నిల్చెను బక్షుల దివ్యవైభవం
బువ్విళులూరు చిత్తమున
నూహ యొనర్చెను జీవితేచ్ఛ దా
దవ్వులఁ బాఱఁదోలెఁ దన
త్రాళ్లు నురుల్ వల లింక నస్త్రముల్
క్రవ్వఁగఁ బేర్చెఁ గోటరము
ఖంబున నిప్పు రగిల్చె గొప్పగన్.

ఉ. ఎండిన తోఁటముం దనల
మేచి రగుల్కొనె బోయఁ "డీశ్వరా!
దండము; నామపాపసము
దాయము హేయము మేనితోడనే
మండెడుఁగాత మీయనల
మధ్యమునం దిఁక జన్మబాధ లే
కుండెడుఁగాక నాఁకనుచు
మాడ్చుకొనెన్ దను నమ్మహాగ్నిలోన్,

ఉ. దివ్యవిమాన మప్పు డరు
      దెంచెను వచ్చిరి దేవదూతలున్
   సువ్యవసాయతత్క్షణా వి
      శోధితచిత్తుఁ గిరాతకున్ విన
   ష్టవ్యథుఁగొంచుఁ బోయిరి ప్ర
      శంసిత వైభవమొప్ప నప్పుడే
   యవ్యయమైన దివ్యపద
      మందె నతం డది యెంతవింతయో!

వ. అని యిట్లు భారతప్రోక్తమగు కథానకము నప్పార్థివోత్త
   ముండు విప్పి చెప్పి,

ఉ. "వింటివె యీ కథావిధము
      వీడఁడినై యిహలోక భాగ్యపుం
   బంటకు నంట కుంటివని
      భావమునన్ దలపోయఁ బోకుమీ!
   కంటివి గంటి నైహికవి
      కారములెల్లను శాంతిధర్మముల్
   వింటివి వింటి నిత్యసుఖ
      వృద్ధిని బుద్ధిని నాసచేసితిన్.

ఉ. ఎవ్వఁడు ధర్మసక్తుఁ డయి
      యీశ్వరతత్పరుఁడై స్వయత్నముల్
   గవ్వకుఁగూడ మాఱవని

కన్గొని యార్తుల రక్షణార్థులన్
నెవ్వగనుండి కావఁ దన
నేర్పును, భాగ్యము, వెచ్చపెట్టునో
యవ్వరణీయ వర్తనున
కబ్బెడు నిండును నందు సౌఖ్యముల్.

మ. ఇహలోక స్పృహతోడనే యుడుకు చే
దేదో మహాయాస మ
స్వాహముం జెందుచుఁ బారలౌకికసుఖా
నందంబు నందంగ స
న్నహనం బించుకయేని చేయని యువి
జ్ఞానాత్మకుం డెమ్మెడన్
బహుళానర్థము లందుఁగాని సుఖముం
బ్రాపింపఁ డోకృపాహున్."

క. అనుటయు నానెయ్యుం డి
ట్లనియె "బళారే, నృపోత్తమా! నీమాటల్
వినఁదగినవి మననము చే
యను దగినవి మెచ్చుకొంటి నానానంటిన్.

ఉ. భారతమందు నింక నగ
పాలక ధర్మవిశేషముల్ మహో
దారముగా వచింపఁబడె
నవ్యపియుక్ వినియుందురే కదా

యూరక వానిఁ ద్రోసి, యిది
యొక్కటియే పరమార్థ మంచు విూ
రారయుచుందురేమి ? యిటి
యన్నిటిఁ దిన్నఁగఁ జూడఁగూడదో !"

గీ. పుడమిఁ జేఁదు బుజముఁ బుడుకుచుఁ జెలికాని
తోడ నదియె స్మితము తొంగలింప
"అన్న ! నీ హితోక్తి విన్నాఁడ దానిని
దీని నింక సంప్రతించువాఁడ."

క. అది మొదలుగ ను నృపుఁ డొ
క్కదెసన్ బరమార్థ మింకొకదెసన్ రాజ్యా
భ్యుదయార్థము సాధించుచుఁ,
బదిలముగా నిహపరార్థభాజనమయ్యెన్.

శా. శ్రీనిత్యోదిత వాసిరెడ్డికులజ
శ్రీచంద్రమౌళీశ్వర
క్ష్మానాథాశ్రితపండిత ప్రవరస
త్కారార్థ కావ్యార్థ సం
ధానాలోకనజాతకౌతుక సము
ద్యత్సూక్తి మత్ప్రోక్త
ఖ్యానంబియ్యది శాంతచిత్తులకు నా
హ్లాదంబు గల్పించుతన్.

BLi

శ్రీ వేటూరి

ప్రభాకరశాస్త్రిగారి

గ్రంథములు

శృంగారశ్రీనాథము
తెలుఁగుమెఱుఁగులు
మీఁగడతఱకలు
ప్రజ్ఞాప్రభాకరము
క్రీడాభిరామము
(విపులమయిన పీఠికతో)
ప్రబంధరత్నావళి
చాటుపద్యమణిమంజరి
(ద్వితీయభాగము-ప్రథమసంపుటము)
ప్రతిమా నాటకము
నాగానందము
మధ్యమవ్యాయోగము
కర్ణభారము
మత్తవిలాసము
కనుపుతీపు
కపోతకథ
విశ్వాసము
దివ్యదర్శనము
మూన్నాళ్ల ముచ్చట
చిన్ననాఁటిచేష్టలు
తంజావూరి ఆంధ్రరాజుల చరిత్ర
కామధేనుపుకథ
కనకాభిషేకము

AOUA105B124

BC

V. R. NARLA MEMORIAL LIBRARY ★
V. R. NARLA
D. P. R. I.
Acc. No.

Copies can be had from
V. Ananda Murthy,
2-1-294, NALLAKUNTA,
MUSHEERABAD P. O.
HYDERABAD - 20.

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | AOUA105B124 |
| పుస్తకం పేరు | [illegible] |
| తారీఖు | 31 December 2025 |
| ముందు అట్ట | notes |
| వెనుక అట్ట | yes |
| మొత్తం పేజీలు | 6541 |
| పెద్ద సైజు పేజీలు | NO |
| ఖాళీ పేజీలు | Ad: BCi |
| లేని పేజీలు | NO |
| తయారు చేసినది | Kethura |
| పేజీలు వరుసపరిచినది | Kethura |
| స్కాన్ చేసినది | Kefla |
| పరీక్ష చేసినది | anusha |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | good |